www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 10 నవంబర్ 2024

5

తూర్పుగోదావరి



పెన్షనర్స్ దినోత్సవాన్ని ప్రభుత్వం నిర్వహించాలి

ప్రజాశక్తి–చాగల్లు

డిసెంబర్ 17న పెన్షనర్స్ దినోత్సవాన్ని ప్రభుత్వమే నిర్వహించాలని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కోడి నాగేశ్వరరావు అన్నారు. శనివారం ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం సమావేశం చాగల్లు అంబేద్కర్ రీడింగ్ భవనంలో నిర్వహించారు. పెన్షనర్ల పే స్లిప్‌లో భార్య పుట్టిన తేదీ వివరాలను చేర్చాలని కోరారు. పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని యూనియన్ నాయకులు కోరారు. నవంబర్ నెలలో జన్మించిన సంఘం సభ్యులు కెఎస్ఎన్.మూర్తి, వెత్సా గంగాధర్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు ఆత్మారి రామారావు, బచ్చు వెంకటరత్నం, డి.నాగేశ్వరరావు, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్స్‌లో అప్పుల వడ్డన

- వసతి గృహాల నిర్వహణకు తప్పని పాట్లు
- వార్డెన్లకు వడ్డింపు కష్టాలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

హాస్టల్ వార్డెన్లకు పెండింగ్ బిల్లులు కొండలా పేరుకుపోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సక్షేమ హాస్టళ్లకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడమే ఈ దుస్థితికి కారణం. తాజాగా విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడిచినా బకాయిలు చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. నెలల తరబడి బకాయిలు ఉన్నాయి. ఈ బకాయలపై అధికారులు సైతం స్పష్టమైన సమాధానం చెప్పడంలేదని వార్డెన్లు వాపోతున్నారు. జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రి మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ కలిపి 35 హాస్టళ్లు ఉన్నాయి. ఈ హాస్టళ్లలో 2,330 మంది విద్యార్థులు వసతి సౌకర్యం పొందుతూ విద్యను అభ్యసిస్తున్నారు. ప్రభుత్వం హాస్టల్‌లోని విద్యార్థులకు ప్రి మెట్రిక్ హాస్టల్‌కు మూడు, నాలుగో తరగతి వరకూ విద్యార్థికి రూ.11,50, నుంచి 10వ తరగతులకు రూ.1,400 మెస్ ఛార్జీల రూపంలో చెల్లిస్తున్నారు. రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్‌లలో అక్టోబరు అనంతరం బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. ఒక వైపు సకాలంలో బిల్లులు విడుదల చేయకపోవడం మరో వైపు పెరిగిన నిత్యావసరాల ధరలతో ఈ ఛార్జీలు చాలడం లేదని వసతి గృహాల సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజమహేంద్రవరంలోని ఒక



హాస్టల్‌లో 110 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రతి నెలా రూ.80,000 బిల్లులు విడుదల చేయాల్సి ఉంది. నాలుగు నెలలుగా నిధులు విడుదల చేయలేదు. అప్పు చేసి హాస్టల్‌లో విద్యార్థులకు భోజనం పెడుతున్నామని అక్కడి సిబ్బంది వాపోయారు. మరోవైపు సాంకేతిక సమస్యలూ గోరు చుట్టుపై రోకలి పోటులా మారుతున్నాయి ఫింగర్ ప్రింట్స్ పడకపోవడం, మ్యాపింగ్, కోడ్ సమస్యలు వెంటాడుతున్నాయి. మరోవైపు పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు గోరుచుట్టుపై రోకలి పోటులా మారాయి. గతేడాది కేజీ కందిపప్పు ధర రూ.110 కాగా ప్రస్తుతం రూ.160కు చేరింది. లీటరు రూ.69 ఉండే పామాయిల్ రూ.90కి చేరింది, చింతపండు రూ.రూ.99 నుంచి 180కి, పెసరపప్పు రూ.80 నుంచి రూ.140కు చేరింది. గ్యాస్ సిలిండర్ ధర రూ.850 నుంచి రూ.930కి చేరింది. పెరిగిన ధరలకు అనుగుణంగా డైట్ ఛార్జీలు పెంచాలని వార్డెన్లు కోరుతున్నారు. బిల్లులు ఎపుడు విడుదలవుతాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. రాజమహేంద్రవరంలో ఒక ఎస్‌సి హాస్టల్ వార్డెన్ మూడు నెలలుగా అప్పులు తెచ్చి మెనూ అమలు చేస్తున్నారు. ఒక నెల రూ.4 రెండు నెలలు రూ.5 వడ్డీకి రూ.4 లక్షలు అప్పు చేశారు. ఈ నెల అప్పుకోసం వెళితే.. రుణదాత 'ముందు ఇచ్చిన అప్పు చెల్లించిన తరువాత కొత్త అప్పు ఇస్తామని చెప్పారని ఆ వార్డెన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల ముగిస్తే ఇంట్లో బంగారం, వస్తువులు అమ్మి విద్యార్థులకు భోజనం పెట్టాల్సి వస్తుందని వాపోయారు. మరోవైపు ప్రభుత్వం చెల్లించే ధరకు.. బయట మార్కెట్‌లో ఉన్న ధరకు భారీ వ్యత్యాసం ఉండడంతో ఏం చేయాలో వార్డెన్లకు పాలు పోవడం లేదు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే ఉన్నతాధికారులు ఎక్కడ బాధ్యులు చేస్తారోనని ఆందోళన చెందుతున్నారు. గడిచిన రెండేళ్లలో ధరలు గణనీయంగా పెరిగాయి. అప్పటి ధరలకు అనుగుణంగా భోజనం అందించడం సాధ్యమా అని వార్డెన్లు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరుతున్నారు.

ధరలు, విద్యుత్ ఛార్జీల భారాలు తగ్గించాలి

ప్రజాపోరులో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి–రాజమహేంద్రవరం

ధరలు, విద్యుత్ ఛార్జీల భారాన్ని తగ్గించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ప్రజాపోరు ప్రచార క్యాంపైన్ శనివారం స్థానిక అవ వాంబే కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి బి.పవన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చి 150 రోజులు పూర్తయ్యాయని, కానీ ఎన్నికల హామీల అమలో వెనుకబడ్డయని విమర్శించారు. ప్రజా సమస్యలు పరిష్కరించకుండా జమిలి ఎన్నికల పేరుతో ఫెడరల్ వ్యవస్థపై దాడికి పాల్పడుతున్నారని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతూ ప్రజలపై ధరల బారాన్ని మోపుతున్నారని, ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి, ప్రజా పంపిణీ ద్వారా 11 రకాల నిత్యావసర సరుకులు అందించడం ద్వారా అధిక ధరలను నియంత్రించాలన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే గడిచిన కాలానికి చెలించిన విద్యుత్ ఛార్జీలకు మరలా సర్దుబాటు ఛార్జీల పేరుతో రూ.16



ప్రజాపోరు క్యాంపెన్‌లో పాల్గొన్న సిపిఎం నాయకులు

వేల కోట్ల భారాన్ని రాష్ట్ర ప్రజలపై మోపడాన్ని తీవ్రంగా తప్పు ప్టారు. రాష్ట్రం, దేశంలో మహిళలకు రక్షణ లేదని, నిత్యం దాడులు, ఆఘాయిత్యాలు నిత్య కృత్యంగా మారాయని వాటిని అరికట్టి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కరించాలని డిమాండ్స్‌తో నవంబర్ 14న జరిగే ధర్నాలను ప్రజానీకం పాల్గొని జయప్రదం చెయ్యాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్.ఎస్.మూర్తి, బి.వి.పూర్ణిమరాజు, వి.రాంబాబు, పాపాయమ్మ, శ్రీను, రాజా పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌లలో కలెక్టర్ ప్రశాంతి తనిఖీ

ప్రజాశక్తి–పెరవలి, సీతానగరం

పెరవలి మండలంలోని తీపర్రు ఇసుక రీచ్‌ను శనివారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జెసి ఎస్.చిన్న రాముడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వినియోగదారుల నుంచి వివరాలు సేకరించారు. రీచ్ పాయింట్ వద్ద వినియోగదారులతో మాట్లాడారు ట్రాక్టర్ల అద్దె వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇసుక తవ్వకం ఛార్జీలుఏ మినహా ఎక్కువ మొత్తం డిమాండ్ చేస్తే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా డీసిల్టేషన్ పాయింట్స్ ఇసుక ఓపెన్ రీచ్‌లు అందుబాటులోకి తీసుకు వచ్చినట్టు తెలిపారు. వీరి వెంట కొవ్వూరు ఆర్‌డిఒ రాణి సుస్మిత, గనుల శాఖ ఎడి ఫణి భూషణ్ రెడ్డి, తహశీల్దారు డి.అచ్యుత కుమారి, రెవెన్యూ అధికారి పావని సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం మండలం వంగలపూడి ఇసుక ర్యాంపును కలెక్టర్ పి.ప్రశాంతి తనిఖీ చేశారు. నిర్మాణ పనులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా ఇసుక సరఫరా చేయడమే లక్ష్యంగా పెద్ద మొత్తంలో బోట్స్‌మ్యాన్ సొసైటీలకు అనుమతులు



సీతానగరం ఇసుక రీచ్‌న పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ఇచ్చామన్నారు. వంగలపూడి రీచ్ పాయింట్ ద్వారా కనీసం రోజుకు 2000 మెట్రిక్ టన్నుల ఇసుకను అందుబాటులో తీసుకురావాలన్నారు. ఇందుకోసం రెండు షిఫ్ట్‌లో బోట్స్‌మ్యాన్ సొసైటీలు పని చేయాల్సి ఉంటుందన్నారు. విశాఖపట్నం జిల్లాకు ఈ ర్యాంపును కేటాయించామని, అక్కడి నుంచి జిల్లాకు బల్క్ ఆర్డర్‌ను పంపుతున్నట్లు తెలిపారు. ఇసుక రవాణా, సరఫరాలో ఆటంకాలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 18004252540కు ఫోన్ చేయాలని జెసి చిన్న రాముడు తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఒ ఆర్.కృష్ణ నాయక్ తదితరులు ఉన్నారు.

ఘనంగా సత్యాగ్రహ ఆశ్రమ వార్షికోత్సవం

ప్రజాశక్తి - సీతానగరం

గౌతమీ సత్యాగ్రహ ఆశ్రమం శత వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. సీతానగరంలో 1924లో బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా స్వతంత్ర సమరయోధులకు శిక్షణా తరగతులు ఇవ్వటానికి డాక్టర్ బ్రహ్మ జోస్యుల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గౌతమి సత్యాగ్రహ ఆశ్రమానికి 1929, 1933లో రెండుసార్లు మహాత్మా గాంధీ కస్తూర్బాతో కలిసి ఆశ్రమానికి వచ్చి బస చేశారు. దీంతో ఈ ఆశ్రమానికి కస్తూర్బా గాంధీ ఆశ్రమంగా పేరు పెట్టారు. ఈ కార్యక్రమానికి రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ, అవనిగడ్డ ఎంఎల్ఎ మండలి బుద్ధప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మొదటిగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆశ్రమం ప్రారంభించి 100 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా



స్తూపాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ బలరామకృష్ణ తదితరులు

పలువురు వక్తలు ఆశ్రమం గురించి మాట్లాడారు. మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ఆశ్రమం గురించి, అప్పటి గౌతమి సత్యాగ్రహం ఉద్యమ ఘట్టాలను అధ్యయనం చేసి రిటైర్డ్ ప్రొఫెసర్ బొంగు రాజారావు రెండు గ్రంథాలు రచించారని తెలిపారు. అనంతరం శత వార్షికోత్సవ స్థూపాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాజానగరం మాజీ ఎంఎల్ఎ కోర్పు అచ్చమాంబ, రాష్ట్రపతి అవార్డు గ్రహీత కృష్ణదేవరాయలు యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ సలాక రఘునాథ శర్మ, నన్నయ్య యూనివర్సిటీ ప్రొఫెసర్ తలారి వాసు, పురావస్తు ప్రాంతీయ సంచాలకులు కె.తిమ్మరాజు, నరసాపురం డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ అరపరాల నారాయణరావు, ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల పాల్గొన్నారు.

పౌల్ట్రీ ఫారాలను పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి–పెరవలి

మండల నడుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో 8 పౌల్ట్రీ ఫార్మ్ ఉండగా వాటిలో కొన్ని జనావాసాలకు దగ్గరగా ఉండటంతో దుర్గంధం వెదజల్లుతోందని గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఆర్‌డిఒ వాణి సుస్మిత శనివారం సిబ్బందితో పౌల్ట్రీ ఫార్మ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అధికారి పావని, పంచాయతీ కార్యదర్శి రాంబాబు, విఆర్‌ఒలు కె.రాజశేఖర్, దావీదు, ముప్పిడి నాగేశ్వరరావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ అధ్యాపకునిగా రమేష్‌బాబు

ప్రజాశక్తి–రాజమహేంద్రవరం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రస్థాయిలో ఉత్తమ అధ్యాపకునిఆ కొండ్రు రమేష్ బాబును ఎంపిక చేసింది. ఇంటర్ ఎడ్యుకేషన్‌లో సుమారు 28 ఏళ్ల అపారమైన సేవలందించినందుకు ఆయనను ఎంపిక చేశారు. కళాశాల ప్రిన్సిపల్ అధ్యాపక, అధ్యాపకేతర బృందం, కళాశాల విద్యార్థులు రమేష్ బాబుకు అభినందనలు తెలిపారు.

గర్భిణులు నిత్యం సంతోషంగా ఉండాలి

ప్రజాశక్తి - నల్లజర్ల

గర్భిణులు నిత్యం సంతోషం, ఆనందంగా ఉంటే పుట్టబోయే బిడ్డ కూడా సంపూర్ణంగా పుడుతుందని ప్రభుత్వాసుపత్రి అదనపు వైద్యులు డాక్టర్ మహ్మద్ సిరాజుద్దీన్ అన్నారు. గర్భిణులకు నెలవారీ వైద్య, ఆరోగ్య పరీక్షలను ప్రధానమంత్రి సురక్షిత్ మాతత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులకు ఉచితంగా పరీక్షలు చేయండంతో పాటు, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సిరాజుద్దీన్ మాట్లాడుతూ, పుట్టే బిడ్డ కోసం పౌష్టికాహారాలైన పాలు, పండ్లు, ఆకుకూరలు, పప్పు దినుసులు, మాంసం, చేపలు తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, వైద్యుల సలహా లేకుండా సొంతంగా ఎలాంటి మందులూ వాడరాదన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ పలివెల ప్రసాదరావు, జివివి.ప్రసాద్ పాల్గొన్నారు.

కడియం మృగాళ్లను కఠినంగా శిక్షించాలి

ఐద్వా, ప్రజాసంఘాల కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

కడియం మండలం బుర్రిలంక గ్రామంలో వివాహితపై సామూహిక అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఐద్వా, శ్రామిక మహిళా, ఉపాధ్యాయ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నగరంలోని ఉమెన్స్ కాలేజీ సెంటర్‌లో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున మహిళలు, విద్యార్థులు పాల్గొని మద్దతు తెలిపారు. అత్యాచారం, హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధిత మహిళ కుటుంబానికి న్యాయం చేయాలని, నర్సరీల్లో పని చేసే మహిళా కార్మికులకు రక్షణ కల్పించాలని, మహిళలు, చిన్నారులపై జరుగుతున్న ఘాతుకాలను అరికట్టాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్ట్‌ల ద్వారా త్వరితగతిన నిందితులకు శిక్షపడేట్టు చేయాలని, మద్యం, మాదక ద్రవ్యాలను నిషేదించాలని, పోర్న్ వెబ్ సైట్ లను నిషేదించాలని, మహిళలు, చిన్నారుల రక్షణ కోసం సమగ్ర చట్టం తీసుకురావాలని నినదించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షులు జరీనా, కార్యదర్శి తులసి, ఉపాధ్యాయ సంఘం జిల్లా నాయకులు శ్రీమణి, ఐద్వా సీనియర్ నాయకులు టి.సావిత్రి మాట్లాడారు. నర్సరీలో పని చేసే వివాహితపై జరిగిన ఘాతుకాన్ని తీవ్రంగా ఖండించారు. ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ ద్వారా త్వరితగతిన విచారణ జరిపి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. నర్సరీల్లో ఎక్కువ మంది మహిళలే పనిచేస్తారని , పనికి వచ్చే సమయంలో పని ముగించుకొని ఇళ్లకు తిరిగి వెళ్లే సమయాల్లోను, పని ప్రదేశంలోనూ కూడా వారి రక్షణకు నర్సరీ యజమానులు, ప్రభుత్వం తగు భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు. బాధిత మహిళ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.25 లక్షలు ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం హామీ ఇచ్చినట్టు తక్షణమే ఆ కుటుంబానికి సొంత ఇల్లు ఇవ్వాలన్నారు. కుమారుడికి చదువు పూర్తయ్యాక ఉద్యోగం ఇస్తామని కాకుండా తక్షణమే ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి, చదువును కొనసాగించే విధంగా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. మానసిక, శరీరక వైకల్యంతో బాధపడుతూ తన పని తాను చేసుకోగలిగే స్థితిలో ఆమె కుమార్తె లేదన్నారు. ఆమె భద్రత కూడా ప్రస్తుతం ప్రశ్నర్థకంగా ఉన్న నేపథ్యంలో



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఐద్వా నాయకులు

ప్రభుత్వమే బాధ్యతను స్వీకరించాలని కోరారు. మహిళలు, చిన్నారులపై రోజురోజుకూ అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయని, వాటికి కారణమవుతున్న మాదక ద్రవ్యాలు, మద్యం, పోర్న్ వంటి వాటిని పూర్తిస్థాయిలో నిషేదించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి అరుణ కుమారి, జిల్లా నాయకులు విజయగౌరి, రాజేశ్వరి, పార్వతి, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అన్నామణి, వెంకటలక్ష్మి అంగన్‌వాడీ యూనియన్ నాయకులు శారద, సునీత, రామలక్ష్మి, మేరీ, ఐద్వా నాయకులు కాశీ అన్నపూర్ణ, నవీన కుమారి, అంజలి, సిఐటియు నాయకులు పూర్ణిమరాజు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

తాడిపర్రులో విద్యుత్ షాక్‌తో దుర్మరణం పాలైన యువకుల కుటుంబాలను శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తాటిబెల్లం సహకార ఫెడరేషన్ చైర్మన్ బొల్లా ముసలయ్య గౌడ్ పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా కల్లుగీత సహకార సంఘం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

విద్యార్థుల అభివృద్ధికి నిరంతర కృషి

ప్రజాశక్తి–రాజమహేంద్రవరం

పేద విద్యార్థుల అభివద్ధికి కేశవభట్ల ఛారిటబుల్ ట్రస్ట్ నిరంతరం కృషి చేస్తుందని ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం రాజమండ్రి ఆల్కాట్ తోట మున్సిపల్ ప్రాథమిక స్కూల్లో విద్యార్థులకు వాటర్ బాటిల్స్ నాలుగు కుర్చీలను ట్రస్ట్ ఆధ్వర్యంలో అందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదల సంక్షేమానికి ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి వేలాదిమందికి కళ్లజోళ్లు అందించినట్టు తెలిపారు. భవిష్యత్తులో పేదలు నివసించే ప్రాంతాల్లో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్టు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అన్నదాత నాగరాజు, చిటికెన సత్యనారాయణ, బండారు శ్రీను, సుంకర చంద్రమౌళి, కె.సతీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రుడా చైర్మన్‌గా బొడ్డు వెంకట రమణ

ప్రజాశక్తి - సీతానగరం

టిడిపి రాజానగరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొడ్డు వెంకటరమణ చౌదరిని రుడా చైర్మన్‌గా నియమితులయ్యారు. రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలిపారు. ఆయన ఆదివారం రాజానగరం వస్తున్న నేపథ్యంలో ఉదయం 10 గంటల నుంచి రాజానగరం నుంచి కోరుకొండ గుడి వరకు భారీ ర్యాలీతో ఘనస్వాగతం పలకడానికి పార్టీ కార్యకర్తలు సన్నాహాలు చేస్తున్నారు.

ఘనంగా జాతీయ న్యాయ సేవా దినోత్సవం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జాతీయ న్యాయ సేవాధికార దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు నేతత్వంలో శనివారం రాజమహేంద్రవరం రూరల్ మండలం పిడింగొయ్యి జిఎస్‌కె న్యాయ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన జాతీయ న్యాయ సేవాధికార దినోత్సవంపై న్యాయ కళాశాల విద్యార్థులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీగల్ సర్వీసెస్ అథారిటీస్ యాక్ట్‌లోని వివిధ సెక్షన్‌ల గురించి ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు చట్టం ఆమోదించిన రోజును గుర్తుంచుకోవడం కోసం ఈ దినోత్సవాన్ని జరుపుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భారతదేశంలో న్యాయ సహాయ కార్యక్రమాలకు చట్టబద్ధమైన పునాది అవసరమని 1987లో లీగల్ సర్వీసెస్ అథారిటీస్ చట్టం ఆమోదించినట్టు తెలిపారు. దేశంలోని తక్కువ ఆదాయ జనాభాలోని సభ్యులకు అర్హత కలిగిన, ఉచిత న్యాయ సహాయం అందించడానికి చట్టం సహాయం చేస్తుందన్నారు. ఏదైనా వివాదాల పరిష్కారానికి లోక్ అదాలత్ ఏర్పాటుకు కూడా చట్టం అందిస్తుందన్నారు. మహిళలు, వికలాంగులు ఎస్‌టి, ఎస్‌సి, బిసి పిల్లలు, మానవ అక్రమ రవాణాకు గురైన వ్యక్తులు, ప్రకతి వైపరీత్యాల వల్ల ప్రభావితమైన వారితో సహ అర్హులైన వ్యక్తులకు ఉచిత న్యాయ సహాయం అందించడం న్యాయ సహాయ దినోత్సవం యొక్క ప్రధాన లక్ష్యం అన్నారు. ఈ అవగాహన సదస్సులో న్యాయ కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ కోసం సుస్థిరమైన భూభాగం

ప్రజాశక్తి–రాజమహేంద్రవరం

స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సు "జీవ ఆధారిత పర్యావరణ కోసం సుస్థిరమైన భూభాగం' అనే అంశంపై రెండో రోజు సదస్సు నిర్వహించారు. ప్రొఫెసర్ విజయ్ కుమార్, డాక్టర్ ఎన్.లక్ష్మణ్ రెడ్డి, ప్రొఫెసర్ సిసీలియా దేవి, సాగర్ మాట్లాడారు. అమూల్యమైన విషయాలను, పరిశోధనలను విద్యార్థులకు అందించారు. నానో మెటీరియల్స్ జీవ అనువర్తనాలను వివరించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దక్పథం పెంపొందించేలా వారిని ప్రోత్సహిస్తూ ప్రస్తుత సమాజంలో వాటి అనువర్తనాలను వివరించారు. ఈ సదస్సుకు ఆర్థిక సహకారాన్ని అందించిన గెయిల్ చీఫ్ జనరల్ మేనేజర్ కెవిఎస్.రావు అమూల్యమైన సందేశం అందించారు.



గెయిల్ జిఎంను సత్కరిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

ఓటు నమోదుకు ప్రత్యేక శిబిరాలు

జిల్లాలో పలుచోట్ల శనివారం ఓటు నమోదుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

రాజమహేంద్రవరం రూరల్ తొర్రేడు మండల పరిషత్ హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని కలెక్టర్ పి.ప్రశాంతి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటు హక్కు లేని ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని లక్ష్యంతో ప్రత్యేక సమ్మరీ రివిజన్ చేపట్టినట్టు తెలిపారు. దీనిలో భాగంగా 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుకు కోసం తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.కలెక్టర్ వెంట జెసి ఎస్.చిన్న రాముడు, ఆర్‌డిఒ ఆర్.కృష్ణ నాయక్ పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** మండలంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమాన్ని తహశీల్దారు పిఎన్‌డి.ప్రసాద్ పరిశీలించారు. ఈ కార్యక్రమం శనివారం, ఆదివారం రెండు రోజులపాటు, మరల వచ్చే శని ఆదివారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. **తాళ్లపూడి** మొత్తం 89 మంది దరఖాస్తులు వచ్చినట్టు తహశీల్దారు రవీంద్రనాథ్ తెలిపారు., మండల గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావు, డిటి భారతి, ఆర్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ ప్రారంభం

ప్రజాశక్తి–రాజమహేంద్రవరం


విద్యార్థి దశ నుండీ పోటీ తత్వాన్ని అలవరచుకోవాలని డిఇఒ కె.వాసుదేవరావు అన్నారు. స్థానిక ఎస్‌కెవిటి డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో అంతర్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌ను ప్రారంభించారు. ఈ బాల్ బాడ్మింటన్ పోటీలు మన జిల్లాలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఆటలపోటీల్లో సాధించిన సర్టిఫికెట్స్ ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించేందుకు ఉపకరిస్తాయన్నారు. ఈ ఛాంపియన్ షిప్ పోటీలకు రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 13 బ్యాచ్‌లు వచ్చాయని అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి పరిశీలకులు తంబి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, జిల్లా అధ్యక్షుడు ఎవిడి ప్రసాద్, నాగరాజు, ఎస్‌కెవిటి ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎంవిఎం.సుబ్రహ్మణ్యం, సింహాద్రి, ధనరాజ్, ఇబ్రహీం, ప్రకాష్, శ్రీనివాస్ రెడ్డి, రాఘవ రెడ్డి, వీరన్న, డేవిడ్, ప్రకాష్, బాల సుంకయ్య, వెంకట్, శ్రీనుబాబు లక్ష్మి, సత్యవేణి, అన్నపూర్ణ, పరిమళ, సౌజన్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం భవిష్యత్తుకు పునాది

ప్రజాశక్తి–గోపాలపురం

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం భవిష్యత్తుకు పునాది వంటిదని, విద్యార్థులు సైన్స్‌పై నైపుణ్యాలకు పదును పెట్టాలని ఎంఇఒ జి.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ మార్గరెట్ అన్నారు. శనివారం మండలంలోని సెయింట్ మేరీస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. విద్యార్థులు ప్రయోగాత్మంగా చేసిన 150 సైన్స్ ప్రయోగాలను ప్రదర్శించారు. ఎంఇఒ శ్రీనివాసరావు మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగంలో భారతదేశం ప్రపంచ దేశాలతో పోటీ పడుతోందన్నారు. విద్యార్థులు సైన్స్‌పై నైపుణ్యాలకు పదును పెట్టాలని సూచించారు. విద్యార్థులు శాస్త్రీయ దక్పథాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. పిల్లల నైపుణ్యాలను బయటకు తీసి ఒక ముఖ్య వేదికగా సైన్స్ ఫెయిర్ ద్వారా ప్రదర్శించడం ద్వారా విద్యార్థుల శక్తి సామర్థ్యాలు వెలికి తీసేందుకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రగతిని తెలుసుకునే పరిపుష్టిగా ఈ ప్రదర్శన ఉంటుందన్నారు. విద్యార్థుల తాము చేసిన పనిని ఇతరులతో పంచుకోవడం వల్ల ఆ భావనలపై అవగాహన పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సిస్టర్ రెజీనా, రీనా, పౌలీన్, ఉపాధ్యాయులు సురేష్, భీమరాజు, సదాలక్ష్మి, వంశీ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



వంతెనకు మరమ్మతులు చేయరూ..

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ప్రమాదం జరిగి, ప్రాణాలు పోయాక ప్రభుత్వం పరిహారం చెల్లించే కంటే, ముందు జాగ్రత్తగా ప్రమాదం జరగకుండా చూస్తే నష్ట నివారణ జరుగుతుందని గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చివటం గ్రామం నుండి సత్యవాడ వైపుకు వెళ్లే మార్గమధ్యంలో గోస్తనీ నదిపై వంతెన పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మరమ్మతులు చేయమని కోరుతున్నారు. ఈ వంతెన మీద నిత్యం వందల సంఖ్యలో పాదచారులు, పదుల సంఖ్యలో భారీ వాహనాలు, రైతులు, కార్మికులు ప్రయాణిస్తారు. అటువంటి వంతెనకు నాలుగు వైపులా రోడ్డు కుంగిపోయి, ప్రమాదపుటంచున ఉంది. కొద్ది కాలంలో రోడ్డు నుండి వంతెన విడిపోయినా ఆశ్చర్యపోనవసరం లేదని స్థానిక రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, సంబంధిత అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలంటున్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి - సీతానగరం

సింగవరంలో తాటాకిల్లు దగ్ధమై చిట్రోతు సీతారత్నం కుటుంబం నిరాశ్రయులవడంతో అవడం విదితమే. ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి పలువురు దాతలు ముందుకు వస్తున్నారు. సిపిఐ ఎంఎల్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారికి రూ.15 వేల నగదు, నిత్యావసాలు, దుస్తులు అందించారు. పలివెల జ్యోతి, నందమూరి చిట్టి స్వామి, సిద్ధే నాగరాజు, కడిదల రాధ, వేటూరి పార్వతి, గ్రామ సర్పంచ్ సంగన చినపోసియ్య, పిండ్రా ఆదియ్య, తమ్మిశెట్టి ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గడ్డి ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ
నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి గ్రామ శివారున రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న గడ్డి ట్రాక్టర్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌పై ఉన్న నలుగురు కూలీలు గాయపడ్డారు. శనివారం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలను పోలీసులు వెల్లడించారు. రంగంపేట మండలం రాయవరం గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు ట్రాక్టర్‌పై గడ్డి లోడ్ వేసుకుని గండేపల్లి నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్నారు. గండేపల్లి గ్రామ శివారున ఆ ట్రాక్టర్‌ను వెనుక వైపు నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌పై ఉన్న నలుగురు కూలీలు గాయ పడ్డారు. వారిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఎస్టేట్ రాజపురంలో నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవిబి.అర్జునరావు తెలిపారు. శనివారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ పి.చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

950 కిలోల రేషన్ బియ్యం సీజ్

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని ఉండూరు ప్రకాశరావు పేటలో ఒక ఇంట్లో నిల్వ ఉంచిన 950 కిలోల రేషన్ బియ్యం సీజ్ చేసినట్లు శనివారం మండల సివిల్ సప్లై అధికారి కమలకుమారి చెప్పారు. ముందస్తు సమాచారంతో బియ్యం నిల్వ ఉంచిన ఇంటిపై ఎంఎస్ఓ, విఆర్ఒ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. నిర్వాహకుడు శెట్టి లచ్చబాబుపై 6ఏ కేసు నమోదు చేసి బియ్యాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు. కాగా సీజ్ చేసిన బియ్యం విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని చెప్పారు.

ఇద్దరు మద్యం విక్రేతల అరెస్టు

ప్రజాశక్తి - ఆలమూరు

మద్యం విక్రయిస్తూ పట్టు బడిన ఇద్దరిని అరెస్టు చేసి శనివారం స్థానిక ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ సిఐ ఐడి. నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఆలమూరు, కపిలేశ్వర పురం మండలాల్లోని వివిధ గ్రామాల్లో మద్యం బాటిళ్లు విక్రయిస్తున్నారన్న సమాచారంపై ఆయా ప్రదేశాల్లో దాడులు నిర్వహించామన్నారు. ఈ క్రమంలో మండలంలోని చెముడులంక హైవే పక్కన 8 మద్యం బాటిళ్లను కలిగి ఉన్న ఎన్.సీతా రామయ్యను అరెస్ట్ చేసి, వాటిని సీజ్ చేసి పరుచు కున్నాం. అలాగే కపిలేశ్వరపురంలో బెల్ట్ షాపును ఏర్పా టు చేసి మద్యాన్ని విక్రయిస్తున్న ఎస్.తమ్మయ్యను అరె స్టు చేసి అతని దగ్గర ఉన్న 12 మద్యం బాటిళ్ల స్వాధీ నం చేసుకున్నారు. ఈమేరకు ఎక్సైజ్ ఎస్ఐ పి.రాం బాబు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీజిల్ తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - ముమ్మిడివరం

యానాం నుంచి డీజిల్‌ను ఆటోలో అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తిని శనివారం ముమ్మిడివరం పోలీసులు అదుపులోకి తీసుకుని డీజిల్ సీజ్ చేశారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఐపోలవరం మండలానికి చెందిన గాలి సురేష్ ఆటోలో 330 లీటర్ల డీజిల్‌ను యానాం నుంచి తరలిస్తున్నాడు. ముమ్మిడివరం లో శనివారం ఎస్ఐ జ్వాలా సాగర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేస్తుండగా పోలీసులు డీజిల్ ఆటోను పట్టుకుని, డ్రైవర్ ను అదుపులోకి తీసుకుని వాహనాన్ని సీజ్ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వేధింపులపై కేసు నమోదు

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని మల్లేపల్లికి చెందిన ఒక అవివాహిత మహిళను వేధింపులు, బ్లాక్ మెయిలుకు పాల్పడిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ శివనాగ బాబు తెలిపిన వివరాల ప్రకారం..ప్రతిపాడు మండలం ధర్మవరం చెందిన కృష్ణ ప్రసాద్ సదరు మహిళను వేధింపులకు గురి చేస్తున్నట్లు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి సంబంధిత వ్యక్తిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ మాట్లాడు తూ..మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, మహిళలు, బాల బాలికలను వేధించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎటిఎం కార్డు మార్చి
నగదు అపహరణపై

ప్రజాశక్తి - రామచంద్రపురం

మహిళ వద్ద ఉన్న ఎటిఎం కార్డును మార్చి ఒక వ్యక్తి రూ.లక్ష అపహరించాడు. ఈ ఘటనపై శనివారం పోలీసులు తెలిపిన వివరాలు ఇవి.. ద్రాక్షారామ గ్రామానికి చెందిన కారుమూరి మాణిక్యం సెప్టెంబర్ 14న ఎటిఎంలో నగదు తీసుకోవడానికి వెళ్లింది. ఆమె ఎటిఎం కార్డు మిషన్ పెట్టగా నగదు రాకపోవడంతో తికమక పడుతోంది. ఈ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి ఆమె కార్డును ఎటిఎంలో ఉంచి రూ.10 డ్రా చేశాడు. అనంతరం అతడు ఎటిఎం కార్డు ఆమెకు ఇచ్చి వెళ్లిపోయాడు. అతను వెళ్ళిన కాసేపటికి మారుమార్చి మరో ఎటిఎం నుండి రూ.30 వేలు నగదు డ్రా చేసుకున్నాడు. అనంతరం వివిధ పెట్రోల్ బంకుల్లో మరికొంత నగదు డ్రా చేశాడు. మొత్తం రూ.1,04,800 డ్రా చేసుకున్నాడు. నగదు డ్రా చేసుకున్నట్లు ఫోన్‌కు మెసేజ్‌లు రావడంతో ఆమె ఎటిఎం కార్డు మారిందని విషయాన్ని గ్రహించింది. దీంతో ఈ ఘటనపై బాధితురాలు శనివారం ద్రాక్షారామం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ ఢీకొని
పంచాయతీ కార్యదర్శి మృతి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో బొబ్బిల్లంక గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న శ్రీకృష్ణ శనివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆమె విధులు ముగించుకుని ఇంటికి వెళ్తారు. అనంతరం మెడికల్ షాపునకు వెళ్లి వస్తుండగా ట్రాక్టర్ ఢీకొని మృతి చెందారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆగస్టులో ఆమె సీతానగరం మండలానికి బదిలీ అయ్యారు. ఆమె మృతి పట్ల ఎంపిడిఒ భారతి, సిబ్బంది సంతాపం తెలిపారు.

పొలిటికల్ హీట్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు విఘాతం కలుగుతోందని, అవసరమైతే తాను హోం శాఖను తీసుకుంటానంటూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర వ్యాప్తంగా పొలిటికల్ హీట్‌ను పెంచాయి. సాధారణ ప్రజానీకంతో పాటు రాజకీయ నేతల్లోనూ ఈ వాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. టిడిపి, బిజెపి, జనసేన కూటమి ఏర్పడటంలో పవన్ కళ్యాణ్ కీలకంగా వ్యవహరించిన విషయం విధితమే. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత జనసేనానికి తగిన ప్రాధాన్యత ఇవ్వటంలేదనే అసంతృప్తి వ్యక్తమవుతోంది. పవన్ కళ్యాణ్ సూచనలను టిడిపి అధినేత పరిగణలోకి తీసుకోవటంలేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. మరోవైపు క్షేత్రస్థాయిలో టిడిపి, జనసేన నాయకులు మధ్య ఘర్షణలు నిత్యకృత్యంగా మారాయి. రాష్ట్రంలో ఎక్కడో ఒకచోట ఘర్షణలు పరిపాటిగా మారాయి. ఈ నేపథ్యంలో తాజాగా జనసేనాని చేసిన వ్యాఖ్యలు మరింత ప్రాముఖ్యతను పెంచాయి. కూటమిలో నిప్పు రాజుకుందనే ప్రచారం ఊపందుకుంది. అయితే కేవలం నాలుగు నెలలకే ఈ పరిస్థితి ఉంటే రాబోయే నాలుగేళ్ళు ఎలా ఉంటుందనే ఆయా వర్గాల్లో చర్చ ప్రారంభమైంది.

ఎంఎల్‌సి ఎన్నికలకు మోగిన నగారా

ఉపాధ్యాయ ఎన్నికలకు ఎన్నికల నగారా మోగింది. ఈ వారంలో నోటిఫికేషన్ విడుదలైన విషయం విధితమే. జిల్లా వ్యాప్తంగా 16,316 మంది ఓటర్లు ఉన్నారు. మరోవైపు పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలకు ఓటర్ల నమోదు ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. రాజకీయ పార్టీలు ఓటర్లను జల్లెడ పడుతున్నాయి. ఈ నెల 23 వరకూ ఓటర్ల నమోదు ప్రక్రియ కొనసాగనుంది. ఈ నేపథ్యంలో ఉన్నత విద్య పూర్తి చేసిన వారి వివరాలను ఇప్పటికీ రాజకీయ పార్టీలు సేకరించాయి. వ్యక్తిగతంగా కలవటంతో పాటు ప్రధాన కూడళ్లలో ఓటు నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసి నమోదు కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలలో ఇప్పటివరకూ పిడిఎఫ్ విజయ ఢంకా మోగించిన విషయం విధితమే. గెలిచిన అనంతరం ఉపాధ్యాయులు, పట్టభద్రుల గళం శాసన మండలిలో విన్పించడంతో పాటు ప్రజా సమస్యలను పరిష్కార దిశగా విశేష కృషి చేశారు. ఈ ఒరవడికి కొనసాగించేందుకు పిడిఎఫ్ అభ్యర్థులు ఈ ఎన్నికలలో పోటీకి సమాయత్తం అవుతున్నారు.

సిపిఎం ప్రజా పోరు

పెరుగుతున్న అధిక ధరలకు వ్యతిరేకంగా, మహిళలు, బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలకు వ్యతిరేకంగానూ, జమిలి ఎన్నికలను నిరసిస్తూ సిపిఎం చేపట్టిన ప్రజాపోరు ఈ వారంలో ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 14వ తేదీ వరకూ జరిగే ఈ కార్యక్రమాల ద్వారా పాలకుల వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు ప్రజల గొంతుకై సమస్యలను వెలుగెత్తేందుకు



సిద్ధమైంది. ఈ నేపథ్యంలో గత రెండ్రోజులుగా జరిగిన కార్యక్రమాలకు ప్రజలనుంచి విశేష మద్దతు లభిస్తోంది. ప్రజలు భాగస్వాములై తమ మద్దతు తెలుపుతున్నారు. మరోవైపు జమిలి ఎన్నికల పేరుతో రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేందుకు జరుగుతున్న ప్రయత్నాన్ని ప్రజలకు వివరిస్తూ ప్రజాపోరు ముందుకు సాగుతోంది.

అపార్ వ్యవస్థతో సతమతం

నూతన విద్యా విధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో 'అపార్' నమోదుకు తెర తీసింది. త్వరిత గతిన పూర్తి చేయాలని విద్యావ్యవస్థపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తెస్తోంది. విద్యార్థుల పేర్లు ఆన్‌లైన్ చేసే క్రమంలో ఆధార్‌లోనూ, బర్త్ సర్టిఫికెట్‌లలోనూ నమోదైన పొరపాటు ప్రస్తుతం తలపోటుగా మారాయి. మున్సిపాలిటీలు, కార్పొరేషన్, పంచాయతీలలో త్వరిత గతిన సవరణలు పూర్తికాకపోవటంతో తల్లిదండ్రులు కార్యాలయాల వద్ద క్యూ కడుతున్నారు. క్షేత్రస్తాయిలో సమస్యలను పరిగణలోకి తీసుకుని అపార్ నమోదు ప్రక్రియ కాలపరిమితి పొడిగించాలని తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ఎంఎల్ఎ బండారు సత్యానందరావు

ప్రజాశక్తి - రావులపాలెం

రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తుందని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. మండల పరిధి ఈతకోట నెక్కంటి కాలనీలో సర్పంచ్ యర్రంశెట్టి సుబ్బలక్ష్మి అధ్యక్షతన జరిగిన రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎంఎల్ఎ బండారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నెక్కంటి సీఫుడ్స్ సౌజన్యంతో, పంచాయతీ సహకారంతో నెక్కంటి కాలనీ ప్రధాన రహదారికి నూతనంగా నిర్మాణం చేసిన రోడ్డును ఎంఎల్ఎ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అభివద్ధి ఊసే లేకుండా పాలన సాగించి అక్రమాలకు నాంది పలికారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. కాలనీ వాసులు, ముస్లింలు కొన్ని సమస్యలు ఎంఎల్ఎ దృష్టికి తీసుకు రాగా త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డిఎ కూటమి నాయకులు, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ బండారు సత్యానందరావు

యానాం వార్తలు

21న యానాంలో ముఖ్యమంత్రి, గవర్నర్ పర్యటన

ప్రజాశక్తి - యానాం

ఈనెల 21వ తేదీన పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్ రంగస్వామి, గవర్నర్ కైలాస్ నాదన్, ఫిషరీస్ మినిస్టర్ లక్ష్మీనారాయణలు యానాం నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. శనివారం మల్లాడి స్వగృహంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. మత్స్యకారులకు ఒఎన్‌జిసి సంస్థ ద్వారా రావలసిన నష్ట పరిహారం తమ ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. సిఎస్ఆర్ నిధులు ద్వారా చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలకు పుదుచ్చేరి ప్రభుత్వంతో అభివృద్ధి పనులకు కావలసిన అనుమతులు వచ్చినట్లు తెలిపారు. వాటికి సంబంధించి ఈనెల 14వ తేదీన జరిగే శంకుస్థాపన కార్యక్రమాలలో పాల్గొంటానని మల్లాడి తెలిపారు.

ఘనంగా రాష్ట్ర స్థాయి ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి డైరెక్టరేట్ ఆఫ్ స్పోర్ట్స్ అండ్ యూత్ అఫైర్స్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఆటల పోటీలు స్థానిక బాలయోగి క్రీడా ప్రాంగణం, వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఈ పోటీలను ప్రారంభించారు. పుదుచ్చేరి కరైకల్ మాహే యానాం వ్యాప్తంగా 8 జోన్‌లకు సంబంధించిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఒ మునిస్వామి, విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణప్రవీణ్, స్పోర్ట్స్ డిప్యూటీ డైరెక్టర్ వైద్యనాథన్, ఇండోర్ స్టేడియం ఇన్‌ఛార్జ్ ప్రకాష్, పిఇటీలు పాల్గొన్నారు.



దాతలకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న బాలబాలాజీ స్వామి ఆలయ సిబ్బంది

నిత్యాన్నదానానికి రూ.50 వేల విరాళం

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు దాత విరాళం అందజేశారు. స్థానికులు పాటి త్రిమూర్తులు వారి కుటుంబ సభ్యులతో కలిసి బాలబాలజీ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం వారు స్వామి వారి అన్నప్రసాద ట్రస్ట్‌నకు విరాళంగా రూ.50,500 శనివారం అందజేశారని ఆలయ సహాయ కమిషనర్ సత్యనారాయణ రాజు తెలిపారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యములో వేద ఆశీర్వచనం అందజేయగా, దేవస్థానం వారు ప్రత్యేకముగా అభినందించి శేష వస్త్రాలతో సత్కరించి స్వామి వారి చిత్రపటం అందజేశారు.

ర్యాలి ప్రసాద్ పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - కాకినాడ

రాజకీయ విద్యా వ్యాపార కళారంగాల్లో స్ఫూర్తి దాయకంగా నిలిచిన రెడ్ల చరిత్రను అందరూ చదువుకునేందుకు వీలైన భాషలో రూపొందించారని ఆదిత్య విశ్వవిద్యాలయం ఛాన్సలర్ నల్లమిల్లి శేషారెడ్డి అన్నారు. ప్రముఖ రచయిత ర్యాలి ప్రసాద్ రచించిన 'ఘన చరితల రెడ్లు సుగుణ శీలురు భూమంచి రెడ్లు' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. రచయిత ర్యాలి ప్రసాద్ మాట్లాడుతూ శతాబ్దాల కాలం నుంచి తెలుగు జాతికి రెడ్డి ప్రముఖులు అనేక రంగాలలో ఎనలేని సేవలందించారని, వారి కృషిని రేపటి తరాలకు అందివ్వాలనే ఈ పుస్తకం రచించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు నల్లమిల్లి బుచ్చిరెడ్డి మాట్లాడుతూ రెడ్ల ఘన చరిత్రను రచయిత ర్యాలి ప్రసాద్ సవివరంగా అందించారని అన్నారు. సంస్థ కార్యదర్శి ద్వారంపూడి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఆధారాలతో కూడిన చరిత్ర అందరూ చదవాల్సిన పుస్తకమని అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ప్రభుత్వం

ప్రజాశక్తి - కాజులూరు

మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హామీ ఇచ్చారు. శలపాక గ్రామంలో దీపావళి రోజున జరిగిన హత్యోదంతంలో ప్రాణాలు కోల్పోయిన బత్తిల కుటుంబీకులను మంత్రి సుభాష్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ గ్రామంలో చిన్నచిన్న సంఘటనలు జరిగినప్పుడు స్థానికంగా ఉన్న పెద్దలతో కూర్చొని మాట్లాడుకుంటే సరిపోయేదని అన్నారు. అయితే క్షణికావేశంలో బత్తుల కుటుంబంలో ముగ్గురు మృతి చెందడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వం నుంచి ఆయా కుటుంబీకులను అన్ని రకాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందని ఆయన హామీ ఇచ్చారు. మృతి చెందిన రమేష్ కుమారునికి రూ.50 వేలను ఫిక్స్ డిపాజిట్ చేయడం జరుగుతుందని, మృతుల భార్యలకు ఉద్యోగ భద్రత కల్పిస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోతు గనిరాజు, మండల టిడిపి అధ్యక్షులు పేపకాయల బాబ్జి, స్థానిక నాయకులు వల్లు అర్జునరావు, చంద్రు వీర్రాజుచౌదరి, పోతురాజు భీమారావు, అప్పన్న, కోట తాతబ్బాయి పలువురు నాయకులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయం వద్ద అన్నదానం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ముత్యాలమ్మ తల్లి తీర్థ మహోత్సవం, కార్తీక మాసం పురస్కరించుకుని స్థానిక ఆలయం వద్ద శనివారం అన్నదానం నిర్వహించారు. మాజీ సర్పంచ్ వాసంశెట్టి శ్రీనివాస్, రచ్చ కామేశ్వరరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, టిడిపి నాయకులు నడింపల్లి వినోద్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌లో విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట శివారు కాకినాడ రోడ్‌లోని ఎస్ఆర్ బంకులో శనివారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కొలతలు రికార్డులు పరిశీలించి వాటిలో తేడాను అధికారులు గమనించారు. దీంతో 6 ఏ కేసు నమోదు చేసినట్లు ఎంఎస్ఓ వీరాస్వామి తెలిపారు. దీంతో బంక్‌లో ఉన్న 3 వాహనాలు, బంక్‌ను సీజ్ చేసినట్టు సివిల్ సప్లై , విజిలెన్స్ అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ తహశీల్దార్ విజయ్ కుమార్, ఎఎస్ఒ లక్ష్మి, లీగల్ మెట్రాలజీ, స్థానిక విఆర్‌ఒలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి - సామర్లకోట

మున్సిపాలిటీ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆర్‌డిఒ కె.శ్రీరమణి శనివారం పరిశీలించారు. పట్టణ పరిధిలోని జడ్‌పి బాలిక ఉన్నత పాఠశాలలో 129, 130 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటర్ల నమోదు కార్యక్రమంపై బిఎల్‌ఒలను ఆరా తీశారు. అలాగే ఎంఎల్‌సి ఎన్నికల దరఖాస్తులపై బ్లాక్ లేబుల్ అధికారులను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఎంఎల్‌సి ఓట్ల నమోదును వేగవంతం చేయాలని రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులను ఆమె ఆదేశించారు. ఇంకా పోలింగ్ కేంద్రాల్లో వసతులు, ఇబ్బందులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని వినతి

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట శివారు రంగవల్లి నగర్‌లో అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన భద్రాసి శివ కుటుంబాన్ని ఆదుకోవాలని తహశీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. శనివారం ఎపి రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. అనంతరం తహశీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి సంఘటన స్థలాన్ని పరిశీలించి, బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపిఆర్‌సిఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు, నాయకులు డి.సురేష్, డాన్ శ్రీను, జంపెల్లి దుర్గా, వి.అరవాలమ్మ పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - రౌతులపూడి

స్థానిక సిహెచ్‌సి పరిధిలోని పలు గ్రామాలకు చెందిన గర్భిణులకు శనివారం వైద్య అధికారి జానకిదేవి, వైద్యులు డాక్టర్ సునీత, డాక్టర్ పావని, డాక్టర్ సౌమ్య వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ప్రధానమంత్రి సురక్ష యోజన మాతృత్వ పథకంలో ఆసుపత్రి హెడ్ నర్స్ మడకం సరస్వతి ఏర్పాటు చేసిన పౌష్టిక ఆహారాన్ని అందజేశారు.

ఆదిత్య ప్రిన్సిపల్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీ రింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్ ఆదిరెడ్డికి ఎపి ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఆదిత్య విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల లో ఇఇఇ విభాగంలో బిటెక్, ఎంటెక్ చేసి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ చేసిన ఈయన వివిధ హోదాలలో విశేష సేవలు అందిస్తున్నారని అన్నారు. నేడు ప్రిన్సిపల్‌గా ఉన్న డాక్టర్ రమేష్ అదిరెడ్డికి ఆయన శుభాభి నందనలు తెలిపారు. ఆదిత్య అధినేతలు డాక్టర్ ఎన్.శేషారెడ్డి, ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్స లర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ చాన్సలర్ డాక్టర్ ఎంబి.శ్రీనివాసరావు, వివిధ విభాగాల డీన్‌లు, విభాగా ధిపతులు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది రమేష్‌కు అభినందనలు తెలిపారు.

అన్నదాన పథకానికి రూ.25 లక్షల విరాళం

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం వీర వెంకట సత్యనా రాయణ స్వామి వారి దేవస్థానంలో నిర్వ హిస్తున్న నిత్య అన్నదాన పథకానికి ఒక ట్రస్ట్‌కు సంబంధించిన దాతలు రూ.25 లక్షలు విరాళం అందించారు. శనివారం సికింద్రాబాద్‌కు చెందిన గల్లా రోసమ్మ మెమోరియల్ సభ్యులు దీనికి సంబంధించి రూ.25 లక్షల చెక్కును దేవస్థానం ఇఒ కె.రామచంద్రమోహన్‌కు అందజేశారు.

పట్టభద్రుల ఓటు హక్కు కోసం 2,250 దరఖాస్తులు

ప్రజాశక్తి - అంబాజీపేట

తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఓటు హక్కు కోసం అంబాజీపేట మండలంలో మొత్తం 2,250 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తహశీల్దార్ జె.వెంకటేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకర్గ ఓటరు జాబితా తయారీలో భాగంగా పట్టభద్రుల నుంచి ఈ నెల 6వ తేదీ వరకూ ఆన్లైన్లో 1,287 దరఖాస్తులు, ఆఫ్లైన్ లో 963 దరఖాస్తులు అందినట్లు తహశీల్దార్ తెలిపారు. ఈ దరఖాస్తులను మండలంలోని పోలింగ్ బూత్ ల వారీగా విభజించి బిఎల్‌ఒల ద్వారా గ్రామాల్లోని పోలింగ్ బూత్ స్థాయిలో విచారణ చేయను న్నారన్నారు. 18 ఏళ్ల నిండిన వారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలనీ మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు చేయనున్నట్లు తహశీల్దార్ తెలిపారు. మండల పరిధిలో ఉన్న 53 పోలింగ్ కేంద్రాల వద్ద బిఎల్‌ఒలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే పేరు మార్పులు, చేర్పులు చేసుకోవచ్చన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఇద్దరు ఎంపిక

ప్రజాశక్తి - యంత్రాంగం



కెఎస్‌వి.కృష్ణారెడ్డి



కెవి.శోభారాణి

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'ఫెలో టీచర్' విభాగంలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఇద్దరి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారికి శనివారం పలువురు అభినందనలు తెలిపారు. వివరాలు ఇవి..

కొత్తపేట: రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'ఫెలో టీచర్' విభాగంలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి రావులపాలెం మండలం ఈతకోట హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కెఎస్‌వి.కృష్ణారెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు విద్యాశాఖ నుంచి శనివారం ఆదేశాలు వెలువడ్డాయి. నెల 11న విజయవాడలో జరగనున్న ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో ఈ అవార్డును కృష్ణారెడ్డికి ప్రదానం చేయనున్నారు. విద్యారంగంలో విశేష కృషి చేసి ఇప్పటివరకూ ఏ అవార్డుకూ దరఖాస్తు చేయని ప్రధానోపాధ్యాయులను విద్యా శాఖ అధికారులు గుర్తించి గౌరవించే విధంగా ఈ ఏడాది 'ఫెలో టీచర్ అవార్డు'ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పరిచింది. ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

రామచంద్రపురం: పట్టణంలో కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో కంప్యూటర్ అప్లికేషన్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న కెవి.శోభారాణికి ఈ ఏడాదికి రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఈ మేరకు శనివారం కళాశాల విద్యా డైరెక్టర్ కార్యాలయం నుంచి సమాచారం అందింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాస్ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అందరూ అవార్డుకు ఎంపికైన డాక్టర్ శోభారాణీని సత్కరించారు. ఇటువంటి అవార్డు రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మొట్టమొదటిసారిగా లభించినందుకు గ్రామ పెద్దలు, పుర ప్రముఖులు కూడా హర్షం వ్యక్తం చేశారు.

కోటిదీపోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆలమూరు

ప్రతి ఏటా నిర్వహిస్తున్న మండలంలోని నర్సిపూడిలో శ్రీలక్ష్మీనారాయణస్వామి వారి క్షీరాబ్ధి ద్వాదశి కోటి దీపాల మహోత్సవ పోస్టర్‌ను పారిశ్రామికవేత్త, శ్రీమురళీకష్ణ సంస్థల అధినేత, కొత్తపేట నియోజకవర్గ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వంటిపల్లి పాపారావు శనివారం ఆవిష్కరించారు. ఈ మేరకు పాపారావు స్వగృహం నందు జరిగిన కార్యక్రమంలో నిర్వహక కమిటీ, గ్రామ పెద్దల పాల్గొన్నారు. ముందుగా వారందరి ఆధ్వర్యంలో పాపారావును ఘనంగా సన్మానించారు. అలాగే 13న నిర్వహించే కోటి దీపోత్సవానికి తప్పక హాజరు కావాలని వారు పాపారావును కోరారు

రోడ్డు భద్రతపై అవగాహన

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని రామవరం సాం ఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో శనివారం విద్యార్థునులకు రోడ్డు సేఫ్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జాతీ య రహదారికి సమీపంగా వసతి గృహం ఉండటంతో విద్యార్థినులు పాఠశాలకు వెళ్లి, వచ్చే సమయంలో రోడ్డు భద్రతపై తీసుకో వలసిన జాగ్రత్తలను సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ వివరించారు. వసతి గృహ అధికారిని పి.రోజా ను విద్యార్థులకు అందిస్తున్న మౌలిక వస తులు, ఇతర వివరాలు అడిగి తెలుసుకున్నా రు. బాలికల సేఫ్టీ మరియు సెక్యూరిటీ విష యంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. వసతి గృహంలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ 65 మంది విద్యార్థినులు ఉండ డంతో వారు హైస్కూల్‌కు వెళ్లి వచ్చేటప్పుడు మార్గం మధ్యలో ఏదైనా ఇబ్బంది తలెత్తితే తక్షణం డయల్ 100, లేదా సీఐ 9440796529, జగ్గంపేట ఎస్ఐ 9440796569 నెంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు.